సాక్షి శ్రీకాకుళం

గురువారం । 26 । డిసెంబర్ । 2024



రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

దేశంలోని మతోన్మాదుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకుందామని దళిత, ఆదివాసీ, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. - 8లో



సైబర్..సైరన్!

జిల్లాలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. రోజుకొక సరికొత్త మోసం వెలుగులోకి వస్తోంది. - 8లో

మద్యం బాటిళ్ల పట్టివేత

ఎచ్చెర్ల: లావేరు మండలం గుమడాం గ్రామానికి చెందిన వైశ్యరాజు శంకరరావు ఇంటి వద్ద అమ్మకానికి ఉంచిన ఐదు మద్యం బాటిళ్లను పోలీసులు బుధవారం సాయంత్రం పట్టుకున్నారు. నిందితుడిపై ఎస్సై జి.లక్ష్మణరావు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికారికంగా మద్యం విక్రయిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.



నృత్యం చేస్తున్న యువతి



కాశీబుగ్గ: చినబడాం చర్చిలో కొవ్వొత్తులతో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



శ్రీకాకుళం టౌన్‌హాలు వద్ద సెయింట్ థామస్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ బోనెలరాజు



పూల అలంకరణలో బాల ఏసు

హ్యాపీ క్రిస్మస్

విశ్వవ్యాప్త వేడుక క్రిస్మస్‌ను క్రైస్తవులు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉదయం నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్‌లు కట్ చేసి సందడి చేశారు. చర్చి పాస్టర్లు, ఫాదర్లు క్రీస్తు సందేశం వినిపించారు. కోయిర్ బృందం నృత్యాలతో అలరించగా.. యువత ఆధ్యాత్మిక గీతాలాపనలతో ఆకట్టుకున్నారు. చర్చిల వద్ద ఏర్పాటు చేసిన క్రీస్తు వృత్తాంతాల్ని వివరించే ఏర్పాట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

– శ్రీకాకుళం కల్చరల్



తెలుగు బాప్టిస్టు చర్చిలో ఆకట్టుకున్న నృత్యాలు



నరసన్నపేట: ఎస్సీ బాలికల వసతి గృహంలో క్రిస్మస్ ట్రీ వద్ద ప్రార్థనలు



శ్రీకాకుళం కల్చరల్: కీస్టోన్ చర్చిలో కొవ్వొత్తులు వెలిగిస్తున్న చిన్నారులు



శ్రీకాకుళం కల్చరల్: ట్రినిటీ బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

న్యూస్‌రీల్

వైభవంగా కాలభైరవ నిమజ్జనోత్సవం



కాలభైరవ విగ్రహ ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలోని బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో బుధవారం కాలభైరవ నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న కాలభైరవ నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. అనంతరం కాలభైరవ దీక్షాపరులు స్వామివారి విగ్రహాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా నాగావళి నదికి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఏరులై పారిన మద్యం!

- హైవేలో లారీ నుంచి జారిపడిన వైన్ బాక్సులు
- బాటిళ్ల కోసం ఎగబడిన స్థానికులు



జారిపడిన మద్యం బాటిళ్ల బాక్సులను సరిచేస్తున్న సిబ్బంది

కాశీబుగ్గ : పలాస మండలం పారసాంబ గ్రామం వద్ద జాతీయ రహదారిపై మద్యం ఏరులై పారింది. శ్రీకాకుళం వైపు నుంచి పలాస వస్తున్న వాహనం నుంచి పారసాంబ వద్ద వైన్ బాటిళ్లు జారిపడ్డాయి. కొన్ని సీసాలు పగిలిపోవడంతో రోడ్డుపైనే మద్యం పారింది. విషయం తెలుసుకున్న పరిసర ప్రాంత ప్రజలు, మందుబాబులు బాటిళ్ల కోసం ఎగబడ్డారు. అనంతరం నేషనల్ హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రోడ్డుపై ఉన్న గాజు పెంకులను తొలగించారు. కాశీబుగ్గ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేశారు.



రోడ్డుపై పగిలిన మద్యం బాటిళ్లు

27న రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ : శ్రీకాకుళం టౌన్‌హాల్ వేదికగా ఈ నెల 27న జిల్లా స్థాయి ఫెన్సింగ్ క్యాడెట్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా బుధవారం తెలిపారు. అండర్–17 విభాగంలో జరిగే ఈ ఎంపికలకు బాలబాలికలు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5గంటలలోగా పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 27న ఉదయం 8 గంటలకు టౌన్ హాల్ వద్దకు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన ఐడీ కార్డు జిరాక్స్, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం , వ్యక్తిగత ఫెన్సింగ్ మెటీరియల్‌తో హాజరుకావాలని కోరారు. 2008 జనవరి 1 నుంచి 2011 డిసెంబర్ 21 మధ్య జన్మించిన వారే అర్హులని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన వారిని ఈ నెల 28, 29వ తేదీలలో కాకినాడలో జరిగే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్యాడెట్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ 2024–25 పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఫెన్సింగ్ కోచ్ జోగిపాటి వంశీ(7660874844)ని సంప్రదించాలని కోరారు.

మత్స్యకారులకు ఎన్‌ఎఫ్‌డీపీ కార్డులు



కార్డులను అందిస్తున్న నాగరాజు

వజ్రపుకొత్తూరు: మత్స్యకారులు ఎన్‌ఎఫ్‌డీపీ(నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్‌ఫామ్) కార్డులను సద్వినియోగం చేసుకోవాలని మత్స్యశాఖ క్షేత్రాధికారి నాగరాజు కోరారు. బుధవారం పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని మత్స్యకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున మత్స్యకారులు వేటకువెళ్లరాదని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



సోంపేట: బెంకిలిలో నేలకొరిగిన వరి పంట

వదలని వాన.. రైతన్న హైరానా

అన్నదాత ఆక్రందన

- నెల రోజులుగా కురుస్తున్న వర్షాలు
- రెండు అల్పపీడనాలు, తుఫాన్, వాయుగుండంతో అన్నదాతల్లో అలజడి
- పంటను కాపాడుకోవడానికి రైతన్నల అవస్థలు
- నిబంధనలతో నష్ట పరిహారం రాదని తెలిసి మరింత ఆందోళన
- పాలకులకు పట్టని కర్షకుల ఇక్కట్లు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

నెల రోజులుగా కురిసిన వర్షాలు అన్నదాతకు తీవ్ర నష్టం చేకూర్చాయి. రెండు అల్ప పీడనాలు, ఫెంగల్ తుఫాన్, వాయుగుండంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు రైతులను నిండా ముంచేశాయి. నవంబర్ 26న ప్రారంభమైన వర్షాలు డిసెంబర్ 26వ తేదీవరకు పడుతూనే ఉండటంతో కోలుకోలేని విధంగా దెబ్బతీస్తున్నాయి. పంట చేతికి వస్తోందని ఆనందపడేలోపే వర్షాలు కర్షకుల గుండెల్లో అలజడి రేపాయి.

విచిత్రకర పరిస్థితులు..

- ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణ వర్షపాతం 20,893.2 మిల్లీ మీటర్లు కాగా 23,760.4 మిల్లీమీటర్ల వర్షం పడింది.
- అక్టోబర్‌లో 5769.3 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం కాగా, 1186.2 మిల్లీమీటర్లు కురిసింది.
- నవంబర్‌లో సాధారణ వర్షపాతం 2977.1మిల్లీ మీటర్లు కాగా, 213.4మిల్లీమీటర్లు పడింది. అంటే ఖరీఫ్ సీజన్ ఆరంభంలో బాగా పడగా ఆ తర్వాత వర్షాలు తక్కువ పడ్డాయి.
- పంట కీలక దశలో తక్కువ వర్షపాతం నమోదు కాగా అవసరం లేని సమయంలో అంటే నవంబర్ చివరి వారం నుంచి డిసెంబర్ వరకు అధిక వర్షాలు పడ్డాయి. ఇప్పుడీ వర్షాలే రైతుల కొంప ముంచాయి.
- ముఖ్యంగా డిసెంబర్‌లో సాధారణ వర్షపాతం 83.4 మిల్లీమీటర్ల వర్షం కాగా ఈ నెల 25వ తేదీ వరకు 2937.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీన్నిబట్టి అవసరం లేని సమయంలో.. ముఖ్యంగా పండిన పంటను కోత కోసి విక్రయించడమో, దాచుకోవడమో చేసుకోవల్సిన సమయంలో దంచి కొట్టిన వర్షాలు రైతుల్ని నట్టేట ముంచేశాయి.

నీట మునిగిన పంటలు..

జిల్లాలో ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో చాలాచోట్ల వరి కోతలు జరగలేదు. నెల రోజులుగా వర్షాలు పడుతూనే ఉండటంతో కోత కోసేందుకు రైతులు ధైర్యం చేయలేకపోయారు. దీంతో పలుచోట్ల పంట నేల కొరిగింది. మరికొన్ని పొలాల్లో నీరు చేరడంతో వరి పంటను రక్షించుకునేందుకు తిప్పలుపడుతున్నారు. కుప్పల చుట్టూ నీరు నిలిచిపోయింది. కల్లాల్లోని ధాన్యం తడిచిపోవడంతో ఆరబెట్టడానికి అవస్థలు తప్పడం లేదు. తడిసిన వరి పనల నుంచి మొలకలు వస్తున్నాయి. పలుచోట్ల ధాన్యం గింజలు మొలకెత్తుతున్నాయి. మరికొన్ని చోట్ల రంగుమారిపోతున్నాయి. మిగతా నియోజకవర్గాల్లో మరో దుస్థితి నెలకొంది. జిల్లాలో ఇప్పటికే 5వేల హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది. ఎన్యుమరేషన్ పూర్తయితే ఇంకెంత నష్టం వెలుగు చూస్తుందో అంచనా వేయలేని పరిస్థితి ఏర్పడింది.



గార :నీటమునిగిన వరి పనలను గట్టుపైకి తీసుకొస్తున్న రైతు

పాలకుల నిర్లక్ష్యం..

జిల్లాలో నవంబర్ మొదటి వారంలోనే వరి కోతలు ప్రారంభమయ్యాయి. 15వ తేదీకొచ్చేసరికి 50 శాతం కోతలైపోయాయి. నవంబర్ చివరికొచ్చేసరికి 70 నుంచి 80 శాతం కోతలయ్యాయి. సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందుగా అప్రమత్తమవ్వాలి. కొనుగోలు కేంద్రాలు తెరిచి ధాన్యం కొనుగోళ్లు చేయాలి. కానీ, కూటమి ప్రభుత్వానికి ఆరంభంలో పట్టలేదు. ఇతర వ్యవహారాలపై దృష్టి పెట్టి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయలేదు. నవంబర్‌లో ప్రారంభించాల్సిన కొనుగోలు కేంద్రాలు డిసెంబర్ మొదటి వారం వరకు ప్రారంభించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇంతలో వర్షాలు మొదలుకావడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

నిబంధనలతో ఆందోళన..

ప్రస్తుతం సకాలంలో కొనుగోలు చేయకపోవడం వల్ల కొందరు రైతులు నష్టపోగా, వర్షాలు కారణంగా మరికొందరు నష్టపోయారు. ఇప్పటికే కోతలు కోసిన రైతులు వరి పనలను పొలాల్లోనే వదిలేశారు. మరికొందరు కుప్పలు వేశారు. వర్షాలకు ఇవి కూడా మునిగిపోతున్నాయి. వీటిని అధికారులు పంట నష్టం కింద పరిగణించరని తెలిసి రైతులు కలత చెందుతున్నారు. ఇక, కోయని వరి పంట నీటిలో మునిగిపోయి 35 శాతానికి పైగా కుళ్లిపోతేనే నష్టం జరిగినట్టు అంచనా వేస్తారని అధికారులు చెబుతున్నారు. దీంతో పంట కోయని రైతులు లబోదిబోమంటున్నారు. నిబంధనల ముసుగులో నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో రబీ సీజన్‌లో మొక్కజొన్న, అపరాలు, పెసర, మినుము వేయగా వేరుశనగ, బొప్పాయి, కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తుంటారు. ఇప్పటికే చాలాచోట్ల వేసేశారు. అయితే, మొక్కదశలోనే వర్షాలు పడటం, నీరు నిల్వ ఉండటంతో ఆ పంటలు కూడా కుళ్లిపోతున్నాయి.

జిల్లాలో ఈ ఏడాది సాగైన విస్తీర్ణం	పంట దిగుబడి అంచనా	సేకరణ లక్ష్యం
3,60,325 ఎకరాలు	7,24,667 మెట్రిక్ టన్నులు	5 లక్షల మెట్రిక్ టన్నులు

10 బస్తాలూ కష్టమే..



రెండున్నర ఎకరాల భూమిలో వరి కోతకు సిద్ధం కాగా వాతావరణం మార్పులతో ఇప్పుడే కోత వద్దని అధికారులు చెప్పారు. ఆ తర్వాత పది రోజులు వాతావరణం సహకరించలేదు. వర్షం, గాలులతో పంట నేలకొరిగింది. తొలుత 70 బస్తాలు ధాన్యం వస్తుందని అంచనా వేయగా.. ఇప్పుడు 10 బస్తాలు కూడా వచ్చే అవకాశం లేదు. బాగా నష్టం వాటిల్లింది.

– గొబ్బూరు రామలింగేశ్వరరావు, రైతు, జయలక్ష్మి నగర్, నరసన్నపేట

ధాన్యం తీసుకోవడం లేదు



ఎకరా పైబడి వరి ఓవులు కష్టపడి ఒడ్డుకు తీసుకొచ్చి నూర్పు చేశాను. రైసు మిల్లుకు ధాన్యాన్ని పంపించగా తేమ ఎక్కువ ఉందని మిల్లరు తీసుకోవడంలేదు. దీంతో ట్రాక్టర్‌పై ధాన్యం బస్తాలు ఉంచాను. ఎండలు వచ్చాకే ఆరబెడతాను. మరో మూడు ఎకరాలు పంట నీటిలోనే ఉంది. ఉప్పు నీరు కొట్టినా, కింది భాగం అంతా మొలకలు వచ్చేస్తున్నాయి. అధికారులు దృష్టిసారించి ధాన్యం తీసుకునేలా చర్యలు తీసుకోవాలి.

– మల్ల వెంకటసన్యాసి నాయుడు, రైతు, బూరవెల్లి, గార మండలం

పంట చేజారింది..



ఇరవై రోజులుగా కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులతో తీవ్ర నష్టం వాటిల్లింది. రైతులకు ముందస్తు సమాచారం సరైన పద్ధతిలో చేరకపోవడంతో పంటను కాపాడుకోలేకపోయారు. అధికారులు వెంటనే సర్వే చేయించి నష్ట పరిహారం అందించాలి. మా భూమిలో ఎకరానికి పైగా వరి పంట తడిచిపోయింది.

– బమ్మిడి శ్రీనివాసరావు, రైతు, తాళ్లభద్ర, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

పంటలు నాశనం..



మెట్టుప్రాంతాల్లో సాగు చేస్తున్న పెసర, మినుము పంటలపై ఏటా మంచి ఆదాయం వచ్చేది. ఈ సారి ఎడతెరిపి లేని వర్షాలు మా పంటలను నాశనం చేశాయి. సుమారు 90 వేల రూపాయల నష్టం వాటిల్లింది.

– మీసాల సూరిబాబు, రైతు, పెంట, జి.సిగడాం మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



వర్షాలు కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి. రబీలో సాగు చేస్తున్న మొక్కజొన్న, పెసర, మినుము పంటలతో పాటు కూరగాయల పంటలకు నష్టం జరిగింది. ఇంకా పొలాల్లోనే వర్షం నీరు నిలిచి ఉంది.

– గొండు సూర్యనారాయణ, కూరగాయల రైతు, పెద్దకోట, ఎల్.ఎన్.పేట

ఆశలు ఆవిరి..



ఖరీఫ్ చివరిలో వర్షాలు అనుకూలించకపోగా పంటలు ఎండిపోయాయి. చేతికందిన కొద్ది పంట ఇప్పుడు వర్షాల కారణంగా తడిచిపోయింది. ఈ ఏడాది ధాన్యం రాశులతో సంక్రాంతి పండుగను సందడిగా చేద్దామనుకున్నాం. ఆ ఆశలన్నీ ఆవిరయ్యాయి.

– బాలక కనకరాజు, రైతు, పాతటెక్కలి

అన్నదాతను పట్టించుకునేదెవరు..

వర్షాలతో రైతులు అవస్థలు పడుతున్నా కూటమి నేతలకు పట్టడం లేదు. ముఖ్యంగా మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడం లేదు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయడంలో తమదైన పాత్ర పోషించలేదు. వర్షాల నేపథ్యంలో అప్రమత్తం చేయడంలోనూ, పండిన పంటను దాచుకునేందుకు అవసరమైన టార్పాలిన్లు తదితర సమకూర్చే విషయంలో విఫలమయ్యారు. ఇక, అధికారులు కూడా రైతులకు పూర్తిస్థాయిలో జాగ్రత్తలు చెప్పడం లేదు. సాధారణంగా వర్షాలతో పనల మీద ఉన్న వరి నష్టపోకుండా లీటర్ నీటిలో 5 శాతం ఉప్పు కలిపిన ద్రావణంతో (50 గ్రాములు లీటరు నీటికి) పనలపై పిచికారీ చేస్తే గింజ మొలకెత్తకుండా ఉంటుంది. ఇప్పటికే వేసిన కుప్పలలో గింజ మొలకెత్తకుండా, ధాన్యం రంగు మారకుండా 25 కిలోల గళ్లు ఉప్పు, 25 కిలోల ఊక కలిపి కుప్పలపై చల్లితే ప్రయోజనం ఉంటుంది. ఈ విషయాలను రైతులకు నేరుగా తెలియజేసే ప్రయత్నం కొరవడింది.



సోంపేట మండలం బెంకిలి జింకిభద్రలో టమాట పొలంలో నీటిని బయటకు తోడుతున్న రైతులు

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు జేఎల్ పదోన్నతులు కల్పించాలి

- ఆపస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు

టెక్కలి: ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇంటర్మీడియెట్ కళాశాలల్లో బోధించేందుకు జూనియర్ లెక్చరర్లగా పదోన్నతులు కల్పించాలని ఆపస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ డిమాండ్ చేశారు. బుధవారం టెక్కలిలో జిల్లా అధ్యక్షుడు డి.శివరామ్‌ప్రసాద్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 శాతం నాన్‌టీచింగ్ సిబ్బందికి బీఎడ్ అర్హత లేకపోయినా ఎన్సీటీఈ ప్రకారం జేఎల్‌గా పదోన్నతులు ఇస్తుండగా.. బోధన అనుభవం కలిగిన ఉపాధ్యాయులకు జేఎల్‌గా ఎందుకు పదోన్నతులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఉపాధ్యాయ పెన్షనర్లకు బకాయిలు విడుదల చేయాలని, హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించి రెగ్యులర్ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా 12వ పీఆర్సీపై చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు. సంక్రాంతికి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర గౌరవ సలహాదారుడు టి.ఆనందరావు, కార్యదర్శి డి.చలపతిరావు, సభ్యులు ఎస్.నరసింగరావు, కె.సోమేశ్వరరావు, సిహెచ్.రమణ, పి.కాశీవిశ్వనాథ్, గిరి, రవి, వాసు, చిన్ని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలో చోరీ

టెక్కలి రూరల్: స్థానిక అయ్యప్పనగర్‌లో బుధవారం వేకువజామున నిర్మాణంలో ఉన్న ఒక ఇంట్లో చోరీ జరిగినట్లు ఇంటి యజమాని తెలిపారు. అయ్యప్పనగర్‌లో నూతనంగా జోగి హేమసుందర్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. అయితే తన ఇంట్లోని ఒక గదిలో పనికి సంబంధించిన మిషన్లు, మరికొన్ని సామాన్లు భద్రపరిచారు. అయితే బుధవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తి ఆ ఇంటి తాళాలు విరగొట్టి సామాగ్రి దొంగలించినట్లు ఆ ఇంటికి ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. అనంతరం బాధితుడు టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: ఈనెల 22వ తేదీ రాత్రి కె.కొత్తూరు సమీపంలో లారీ డ్రైవర్ అబ్దుల్ పాషా(52) అనే వ్యక్తి తన లారీని రోడ్డు పక్కగా ఆపి, రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలకు గురైన అబ్దుల్ పాషాను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ఆయన గురువారం రాత్రి మృతి చెందాడని, అనంతరం బుధవారం శవ పంచనామ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు అబ్దుల్ పాషా కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా బసవకల్యాణం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈయన ఉల్లిపాయలు లోడుతో కర్ణాటక నుంచి బ్రహ్మపూర్ వైపు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక ఆదిఆంధ్ర వీధి సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలు కాగా, 4 గొర్రెలు మృతి చెందాయి. ఈ మేరకు స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కోటబొమ్మాళి మండలం చుట్టుగుండం గ్రామానికి చెందిన ఎం.దండాసి అనే వ్యక్తి తన గొర్రెలు మేపుకుంటూ ఆదిఆంధ్ర వీధి సమీపంలో రోడ్డు దాటేందుకు ప్రయత్నం చేశాడు. అదే సమయంలో శ్రీకాకుళం నుంచి పలాస వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో దండాసి కాలు విరగడంతో పాటు 4 గొర్రెలు మృతి చెందినట్లు తెలిపారు. గాయపడిన వ్యక్తిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

సైబర్.. రన్..!

- క్లిక్ చేస్తే బుక్ చేస్తారు



- పెరుగుతున్న సైబర్ నేరాలు
- వెలుగులోకి రోజుకొక సరికొత్త మోసం
- కేవైసీ లింక్‌తో దోచేస్తారు
- అందాలను ఎరవేస్తారు

పెరుగుతున్న సాంకేతికతతో పాటు సైబర్ నేరాలు సైతం పెచ్చుమీరుతున్నాయి. రోజుకొక మోసంతో కేటుగాళ్లు కోట్లలో కొల్లగొడుతున్నారు. ఒకరికి ఒకరు కనిపించకుండా, ముఖ పరిచయం లేకపోయినా లింక్ సిస్టమ్‌లా వీళ్ల పనిచేస్తున్నారు. సామన్యుల నుంచి సంపన్న వర్గాలు, యువతీ, యువకుల నుంచి వృద్ధుల వరకు అమాయక ప్రజలంతా వీరి బాధితులే. సెల్‌లో లింకే కదా అని క్లిక్ చేస్తే మిమ్మల్ని బుక్ చేస్తారు. జిల్లాలోనూ ఇలాంటి మోసాలతో రూ.లక్షలు పోగొట్టుకుని పరువు సమస్యతో పోలీసులకు ఫిర్యాదులివ్వలేక అనేకమంది సతమతం అవుతున్నారు. ఈ సైబర్ నేరాలపై అవగాహనకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

– శ్రీకాకుళం క్రైమ్

అందమైన వల.. చిక్కారో విలవిల

మనుషులను కిడ్నాప్ చేసి డబ్బులు వసూలు చేసే పద్ధతి ఎక్స్‌టార్షన్. అలాగే అందమైన అమ్మాయిలను ఎరవేసి, తర్వాత బెదిరించి డబ్బులు దోచుకోవడం సెక్స్‌టార్షన్. వాట్సాప్, ఫేస్‌బుక్, టిండర్ (డేటింగ్ యాప్), ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియా యాప్‌ల ద్వారా మనలో ఉండే బలహీనతలను క్యాష్ చేసుకుని సైబర్ నేరగాళ్లు సెక్స్‌టార్షన్ పద్ధతిలో మోసాలు చేస్తుంటారు. వీరు బీహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి నెట్‌వర్క్ నడుపుతున్నట్లు దర్యాప్తు విభాగాలు చెబుతున్నాయి. జిల్లాలో ఇప్పుడు ఈ మోసాలే ట్రెండీగా నడుస్తున్నాయి. సంపన్న వర్గాలకు చెందిన వృద్ధులు, యువత అధికంగా ఈ మాయలో పడుతుండటం విశేషం. వీరితో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు, వ్యాపారులు, రాజకీయవేత్తలు సైతం జిల్లాలో వందల సంఖ్యలో మోసపోతున్నారు.

ఎలా చేస్తారంటే..

సైబర్ కేటుగాళ్లు అమ్మాయి పేరుతో ఉన్న నకిలీ ఫేస్‌బుక్ (ఇతర యాప్స్) ఐడీని క్రియేట్ చేసి సెలెక్ట్ చేసుకున్న వ్యక్తికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పెడతారు. యాక్సెప్ట్ చేయగానే ముందుగా చాటింగ్.. అలా నంబర్లు ఇచ్చిపుచ్చుకోవడం.. ఆ తర్వాత వాట్సాప్‌లో వ్యక్తిగత సమాచారం (వ్యక్తిది) తెలుసుకుని అడల్ట్ కంటెంట్, న్యూడ్ చాట్ చేసుకునేవరకు కథ తీసుకెళ్తారు. అనంతరం చాట్ నుంచి వీడియో కాల్స్‌లోకి లాగి అవతలివైపు నుంచి రికార్డ్ చేసిన ఓ న్యూడ్ వీడియోను వాట్సాప్ కాల్‌లో లైవ్‌లాగా చిత్రీకరించి ఎదుటి వ్యక్తిని న్యూడ్‌వాట్‌లోకి తీసుకొస్తారు. వెంటనే మొత్తం కాల్ రికార్డ్ చేసి అదే వ్యక్తి వాట్సాప్‌కు వీడియోను షేర్ చేసి డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేస్తారు. లేదంటే యూట్యూబ్‌లో పెడతామని బెదిరిస్తారు.

జాగ్రత్తగా ఉండాలి

ఏ బ్యాంకు కూడా ఆన్‌లైన్ కేవైసీ వివరాలు అడగదు. అపరిచితులు పంపే లింక్‌లు ఓపెన్ చేయరాదు. వాళ్లు మన ఫోన్‌ను హ్యాక్ చేసే సమయంలో మన అకౌంట్‌లో డబ్బులు ఎంత ఉంటే అంత మాయం చేస్తారు. డబ్బులు లేకపోతే ఏమీ చేయలేరు. ఎప్పటికప్పుడు మన ఖాతాను పరిశీలిస్తుండాలి. సెక్స్‌టార్షన్‌కు గురయ్యేవారు తామేదో తప్పు చేసినట్లు భావించి భయపడి పరువు సమస్యతో ఫిర్యాదు చేయకపోతే సైబర్ నేరగాళ్లకు మీరే బలమైన ఆయుధాన్ని ఇచ్చిన వారవుతారు. తక్షణమే ఫిర్యాదు చేస్తే ఆపద నుంచి బయటపడవచ్చు.



– కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం జిల్లా

జిల్లాలో మోసాలు పరిశీలిస్తే..

- జిల్లాలో ఓ ప్రముఖ కుటుంబానికి చెందిన వ్యక్తి తనకున్న బలహీనతతో ఫేస్‌బుక్‌లో అమ్మాయి పరిచయం కాగానే మాటామాటా కలిపాడు. ఆమె కూడా వీడియో కాల్ మాట్లాడటం, న్యూడ్‌గా కనిపించడంతో తనూ న్యూడ్‌గా మారి కొంతకాలం ఆనందం పొందాడు. అక్కడికి కొద్దిరోజులకు ఆ అమ్మాయి న్యూడ్ వీడియోలు బయటపెడతానంటూ భయపెట్టి రూ.5 లక్షలు కావాలని బ్లాక్ మెయిల్ చేసింది. బయట తెలిస్తే పరువు పోతుందని చేసేదేమీలేక డబ్బులు వేసేశాడు. దెబ్బకి ఎఫ్‌బీలో తన అకౌంట్‌ను క్లోజ్ చేసేశాడు.
- జిల్లాలోని ఒక ప్రముఖ వైద్యుడు తెలియని లింక్ క్లిక్ చేయడంతో హాయ్ అని ఓ అమ్మాయి వాట్సాప్ మెసేజ్ పెట్టింది. రిప్లై ఇవ్వడంతో న్యూడ్ వీడియో కాల్స్ తరచూ చేసేది. అక్కడికి కొద్దిరోజులకు వీడియోలు బయటపెడతామంటూ, డిజిటల్ అరెస్టు అవుతావంటూ ఢిల్లీ పోలీస్ సెటప్‌తో కొందరు వ్యక్తులు స్కైప్‌కాల్‌లో దర్శనమవ్వడంతో వాళ్లడిగిన రూ.18.50 లక్షలు చదివించేశారు.
- శ్రీకాకుళం రూరల్ మండలంలో సంపన్న వర్గానికి చెందిన ఓ వృద్ధుడు అశ్లీల వీడియోలు చూసే అలవాటుండడంతో అందులో ఓ మెసేజ్ రావడంతో ఆన్సర్ చేశాడు. ఓ ఇద్దరు యువతుల ముఖాలతో ఉన్న పురుషులు వీడియో కాల్‌లో కనిపించి వృద్ధునికి మత్తెక్కే మాటలతో మైమరిపించగా వృద్ధుడు న్యూడ్‌గా మారాడు. తక్షణమే ఆ వీడియోలు వృద్ధునికి పంపించి రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. పరువు సమస్యతో ఇతనూ ఫిర్యాదు చేయలేదు. రూ.6 లక్షల వరకు సమర్పించేశాడు.
- ఇదే తరహాలో ఏఐ సాయంతో జిల్లాలో ఓ మహిళా అధికారికి మోసం చేసే క్రమంలో ఆమె అప్రమత్తం అవ్వడంతో త్రుటిలో సైబర్ ఉచ్చునుంచి తప్పించుకున్నారు.
- నగరానికి చెందిన ఒక యువతి ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వ్యక్తి వీడియో కాల్స్ చేస్తూ అసభ్యపదజాలంతో మాట్లాడటమే కాకుండా, తన చిత్రాలు న్యూడ్‌గా మార్ఫింగ్ చేసి తరచూ వేధిస్తున్నాడంటూ ఇటీవలే ఫిర్యాదు చేసింది.

వేలల్లో కేవైసీ ఫ్రాడ్‌లు..



జిల్లాలో వేలల్లో కేవైసీ ఫ్రాడ్‌లు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. మీ ఆధార్ కార్డుకు, ఫోన్ నంబర్‌కు, అకౌంట్‌కు, భూమి పుస్తకాలకు ఒకటేమిటి ప్రతీ దానికి ప్రస్తుతం కేవైసీ లింక్ తప్పనిసరి. కానీ దీనిని కొందరు సైబర్ నేరగాళ్లు దుర్వినియోగం చేస్తున్నారు.

- రణస్థలం పరిశ్రమలో పనిచేస్తున్న ఓ వ్యక్తికి వాట్సాప్‌లో ఒక లింక్ వచ్చింది. లింక్ ఓపెన్ చేసిన వెంటనే మీకు రూ.50 వేలు జమవుతుందని ఉండడంతో ఆశతో ఓపెన్ చేశారు. ఇక అంతే వెంటనే అతని మొబైల్‌లో అతనికి తెలియకుండానే రూ.1.50 లక్షల వరకు బ్యాంకు ఖాతానుంచి మాయమైనట్లు మెసేజ్ రావడంతో లబోదిబోమన్నాడు.
- శ్రీకాకుళం నగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న మహిళకు ఇదే తరహా మోసం జరిగి రూ.1.10 లక్షలు తన ఖాతాలో సొమ్ము మాయమైంది.

అప్రమత్తతే ఆయుధం

- సైబర్ మోసానికి గురయ్యేవారు గోల్డెన్ అవర్‌లో తక్షణమే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి.
- ఠీఠీఠీ. ఛిyఛ్ఛటఛిటజీఝ్ఛ. జౌఠి. జీ పోర్టల్‌లో ఆన్‌లైన్ ఫిర్యాదివ్వాలి. సంబంధిత బ్యాంకు ప్రతినిధులను సంప్రదించి ఖాతాలను ఫ్రీజ్ చేయించాలి. పరిధి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలి.
- అలాగే జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న సైబర్ సెల్‌ను కూడా సంప్రదించాలి.
- ఎవరైనా బ్యాంకులో మ్యూల్ ఖాతా (మనీ లాండర్ చేయడానికి ఉపయోగించే ఖాతాల కోసం వాడే కరెంట్ అకౌంట్)తమకు తెలియకుండా వేరే వ్యక్తులు తెరవాలనుకుంటే వెంటనే 1930 సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేయాలి. అంతేకాక ఆర్టీజీఎస్ ద్వారా రూ.2 లక్షల కంటే ఎక్కువ మొత్తాన్ని సేవింగ్స్ అకౌంట్ నుంచి కరెంట్ అకౌంట్‌కు బదిలీ చేస్తే ఖాతాదారులను అప్రమత్తం చేయాలి.
- అన్ని బ్యాంకుల్లో డిజిటల్ అరెస్టు, పెట్టుబడుల పేరుతో మోసాలు, ఇతర సైబర్ నేరాలకు సంబంధించి ఫ్లెక్సీలు, గోడపత్రికలు ప్రదర్శించాలి.

వేతనాలు పెంచాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, 42 రోజుల సమ్మె ఒప్పందంలో అంగీకరించిన అంశాలు అమలు చేయాలని, మిని సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ – హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కల్యాణి, డి.సుధ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ – హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా సమావేశాన్ని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలపై యాప్‌ల భారం తగ్గించాలని పేర్కొన్నారు. సెంటర్ నిర్వహణకు ఇవ్వాల్సిన బిల్లులు, అద్దెలు ప్రతినెలా చెల్లించాలని కోరారు. కూటమి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి, నేటికి కనీసం ఆ దిశగా ఆలోచన చేయకపోవడం దారుణమన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చులకు రూ.20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కోరారు. అదేవిధంగా వేతనంతో కూడిన మెడికల్ లీవ్ కనీసం 3 నెలలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ – హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు పి.లత, కె.సుజాత, వి.హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఒడియా స్కూల్ కాంప్లెక్స్‌లు కొనసాగించాలి



సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కమిటీ సంఘ ప్రతినిధులు

సోంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఒడియా స్కూల్ కాంప్లెక్స్‌లు కొనసాగించాలని ఒడియా టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్ పాడి, బృందావన్ దొళాయి మాట్లాడుతూ.. ఇప్పటివరకు ప్రత్యేకంగా ఒడియా మీడియం ఉపాధ్యాయులకు జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్‌లను రద్దు చేసి, పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ఒడియా ఉపాధ్యాయులను వివిధ తెలుగు స్కూల్ క్లస్టర్లలో విలీనం చేయడం సరికాదన్నారు. దీనివలన ఒడియా ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రామహరి పాడి, సంఘ ప్రతినిధులు సురేంద్ర పండ, బేసి కృష్ణమూర్తి, జయర్మ్‌మాళీ, ఎస్.రవి, పట్టిక లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ): దేశంలోని మతోన్మాదుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకుందామని వివిధ దళిత, ఆదివాసీ, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని అంబేడ్కర్ కూడలి వద్ద దళిత, ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మనుస్మృతి దహనం కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ వేదికగా అంబేడ్కర్‌పై తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అయితే మనుస్మృతి తగలబెడుతుంటే పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో సనాతన ధర్మం – భారత రాజ్యాంగం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వచించారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కళ్లేపల్లి రాంగోపాల్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య, పౌర హక్కుల వేదిక నాయకుడు దానేష్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జగన్నాథం, జన విజ్ఞాన వేదిక నాయకుడు గొంటి గిరిధర్, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, డీటీఎఫ్ కోత ధర్మారావు, కవి, సంపాదకుడు కృష్ణారావు, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్, అంబేడ్కర్ విజ్ఞాన మందిరం కమిటీ ప్రధాన కార్యదర్శి బడే కామరాజు, సమతా సైనిక్ దళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్ల రామారావు తదితరులు మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రతో బీజేపీ ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించి పాలకుల పోకడలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎడ్ల జానకిరావు, బొడ్డేపల్లి భుపతిరావు, వీజీకే మూర్తి, తంగి యరమ్మ, లింగాల అప్పన్న, కంఠ వేణు, కృష్ణవేణి బాలు, గన్నెప్పడు, బీవీ రమణ, చిన్నికృష్ణ, హరిప్రసాద్, రామప్పడు, శ్రీనివాసరావు, బీటీఏ నాయకులు చీర రమేష్, జగన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరో ఇద్దరికి గాయాలు



ఇజ్జాడ త్రినాథ(ఫైల్)



ప్రమాద స్థలంలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రణస్థలం: మండలంలోని నెలివాడ జాతీయ రహదారి ఫ్లై ఓవర్ కింద అండర్ పాస్ వద్ద సర్వీస్ రోడ్డులో ద్విచక్ర వాహనంతో వస్తున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పిసిని గ్రామానికి చెందిన ఇజ్జాడ త్రినాథ(50), అతని భార్య ఇజ్జాడ చిన్నమ్మ, అతని మేనల్లుడు మీసాల ప్రకాష్‌లు ముగ్గురు ద్విచక్ర వాహనంపై రణస్థలం మండలంలోని గిరివానిపాలేం వెళ్లి, తిరిగి నెలివాడ మీదుగా స్వగ్రామం పిసిని గ్రామానికి వస్తున్నారు. ఈ సమయంలో శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు సర్వీస్ రోడ్డులో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా ఢీకొట్టింది. ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న మీసాల ప్రకాష్ చిన్న చిన్న గాయాలతో బయటపడ్డాడు. వెనుక కుర్చొన్న ఇజ్జాడ త్రినాథ, అతని భార్య ఇజ్జాడ చిన్నమ్మ అక్కడిక్కడే పడిపోయారు. అయితే త్రినాథ ప్రమాద స్థలంలోనే మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెకు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. త్రినాథ వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నారు. ఇతనికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. దీంతో పిసిని గ్రామంలో విషాద చాయలు అలుముకున్నారు. జేఆర్‌పురం ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఉద్దాన కళాకారులకు సత్కారం



కవ్వం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉద్దానం రచయితలు, కళాకారులు

పలాస: సమాజంలో జరుగుతున్న సమస్యలపై ఉద్దానం రచయితలు స్పందించి జనాన్ని జాగృతం చేసే రచనలు చేయాలని ఉద్దానం రచయితల సంఘం(ఉరసం) అధ్యక్షుడు కుత్తుం వినోద్ పిలుపునిచ్చారు. పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో బుధవారం ఉరసం ఆవిర్భావ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్దానం ప్రాంతానికి చెందిన కళాకారులు, రచయితలు, కవులను ఘనంగా సన్మానించారు. బొడ్డపాడుకు జానపద కళాకారుడు గేదెల అప్పారావును కుత్తుం తాతారావు స్మారక పురస్కారం కింద రూ.5వేలు నగదు, జ్ఞాపిక , శాలువతో సత్కరించారు. అనంతరం నిశితాసి కవ్వం పుస్తకాన్ని ఆవిష్కరించి పరిచయం చేశారు. అందులోని పాటలను కుత్తుం వినోద్, వర్ధమాన గాయకుడు శాంతారావు, దానేసు, లత తదితరులు వినిపించారు. కార్యక్రమంలో జర్నలిస్టు పొట్టి శివకుమార్, రచయతలు కోనేరు ఆదినారాయణ, మద్దు నాగేశ్వరరావు, బత్తిని వినోద్‌కుమార్, బత్తిన శాంతారావు, బోకర తిరుపతిరావు, డప్పు కళాకారుడు సొర్ర రామారావు, పోతనపల్లి కుసుమ, పోతనపల్లి లత, తెప్పల రవివర్మ, కుత్తుం ప్రసాద్, గొరకల లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో సిక్కోలు జయకేతనం

- జూనియర్స్ బాలబాలికల విభాగాల్లో ఛాంపియన్‌గా శ్రీకాకుళం



ఛాంపియన్‌గా నిలిచి ట్రోఫీ అందుకుంటున్న శ్రీకాకుళం బాలురు జట్టు



టైటిల్ అందుకుంటున్న శ్రీకాకుళం బాలికల జట్టుతో సాధు శ్రీనివాస్, కోచ్ మేనేజర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం జట్లు మరోసారి మెరిశాయి. బాలబాలికల రెండు విభాగాల్లోనూ జయకేతనం ఎగురవేసి సిక్కోలు క్రీడల ఖ్యాతిని చాటిచెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం వేదికగా ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల కబడ్డీ ఛాంపియన్‌షిప్–2024 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో బాలబాలికల రెండు విభాగాల్లోనూ యాదృచ్ఛికంగా శ్రీకాకుళం, విజయనగరం జట్లు ఫైనల్ పోరులో తలపడ్డాయి. బాలుర జట్టు 39–18 పాయింట్ల తేడాతో, బాలికల జట్టు 32–16 పాయింట్ల తేడాతో విజయనగరం జట్లపై శ్రీకాకుళం జట్లు విజయదుందుభీ మోగించాయి. జిల్లా కబడ్డీ సంఘ ముఖ్య ప్రతినిధి, పీడీ సాధు శ్రీనివాస్ జిల్లా జట్లను దగ్గరుండి ప్రోత్సహించి మెప్పించారు.

- సర్వత్రా హర్షతిరేకాలు

ఇదిలా ఉండగా జిల్లా జూనియర్స్ కబడ్డీ జట్లు విజేతలగా నిలవడంపై క్రీడా వర్గాల్లో సర్వత్రా హర్షతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ధర్మాన కృష్ణదాస్, మెంటాడ సాంబమూర్తి, శ్రీకాకుళం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, అధ్యక్షుడు నక్క రామకృష్ణ, కార్యదర్శి సాదు ముసలినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి సాదు శ్రీనివాసరావు, డీఎస్‌డీవో డాక్టర్ శ్రీధర్‌రావు, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, బీవీ రమణ, మెట్ట తిరుపతిరావు, కె.మాధవరావు అభినందించారు.

శిశువు మృతిపై బంధువుల అందోళన



ఆస్పత్రి వద్ద అందోళన చేస్తున్న శిశువు కుటుంబ సభ్యులు

టెక్కలి రూరల్: స్థానిక జిల్లా ఆస్పత్రిలో బుధవారం వేకువజామున శిశువు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు అందోళనకు దిగారు. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నందిగాం మండలం గోకర్నపల్లి గ్రామానికి చెందిన పి.శ్రావణి అనే గర్భిణి మంగళవారం టెక్కలి జిల్లా ఆస్పత్రికి ప్రసవం నిమిత్తం వచ్చింది. అయితే ఆస్పత్రిలో జాయిన్ అయ్యాక బుధవారం వేకువజామున పురిటినొప్పులు రావడంతో అమెకు సాధారణ ప్రసవం చేసేందుకు వైద్యులు ప్రయత్నించారు. దీంతో మహిళ మగబిడ్డకు జన్మనివ్వగా ఆ బిడ్డ అప్పటికే అస్వస్థతకు గురై అనంతరం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న శిశువు కుటుంబ సభ్యులు బిడ్డ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆందోళన చేపట్టారు. వైద్యులు సకాలంలో స్పందించి ఉంటే తమ బిడ్డ బతికేవాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై వైద్యురాలు ధనలక్ష్మిని వివరణ అడగగా శ్రావణికి నొప్పులు వచ్చినప్పటి నుంచి ఇద్దరు వైద్యులు దగ్గరుండి ప్రసవం చేశామని, అయితే ఆ పిల్లవాడి మెడకు పేగు చుట్టుకుపోవడం వలన ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. తాము ఎటువంటి నిర్లక్ష్యం వహించలేదని పేర్కొన్నారు. అనంతరం గర్భిణీ కుటుంబ సభ్యులు కొంత సమయం తర్వాత ఆస్పత్రి నుంచి వెళ్లిపోయారు.